# రొట్టెముక్క

ఆకలి అరుస్తోంది. ఎండిపోయిన శరీరంలోంచి, అసహ్యంగా బయటకు కనిపించే రక్త నాళాలను పిండేస్తూ అరుస్తోంది.

పెరిగే ఎండకు రగిలే మంటలా కడుపుల కాల్చేస్తూ అరుస్తోంది.

"అమ్మా! కుసింత తిండి పడేయుండమ్మా!" ఉమ్మడిగా రెండు గొంతుకలు మేడ ముందు ఇనుప గేటు దగ్గర పది నిమూషాలు నుండి అరుస్తున్నాయి.

"కలిగినోరు కుసింత అన్న మెట్టండమ్మా!" మేడవేపు అరుగు మీదికి ఆశగా చూస్తూ అరిచింది-చిరిగిపోయిన పరికిణీ, జాకట్టుంల్లోంచి నల్లటి శరీరం, ఇనుప గేటుకి ముఖాన్ని మరీ దగ్గరగా తెచ్చి, నగిలిపోయిన చేతి రబ్బరు గాజుతో వూచ మీద నెమ్మదిగా దరువేస్తూ.

"అమ్మా! కనికిరించండి, తల్లే!" అరిచాడు ఆమె పక్కనున్న కుఱ్ఱాడు-చిరిగిన లాగును పైకి లాక్కుని ముఖం మీద వడ్డ చింపిరి జుత్తులోంచి మేడ వేపు ఆశగా చూస్తూ.

క్రోటన్ మొక్కలకి నీళ్ళు పోస్తున్న తోటమాలి ఇనుప గేటు వైపు చూసి నిర్లిప్తంగా ముళ్ళ చెట్లకి నీళ్ళు పోయడానికి మరోవైపు వెళ్ళిపోయాడు.

"ఎవరూ లేరు! ఎల్దారి! రాయే!"-విసిగి పోయిన కుఱ్ఱాడు ఆమె చెయ్యి పట్టుకుని లాగాడు.

"ఎల్దారి! ఆగు! కలిగినోళ్ళు! ఎంత మేడుందో నూడు! ఎంత మంది జనముంతన్నారో! తినీ వదిలీసిన నాలుగు మెతుకులు దులిపీసినా నీకూ 'నాకూ శాన. ఎవలోవత్తన్నారు. మల్లాఅరుద్దారి.' హెచ్చరించి దామ్మాయి. విశాలమైన మేడలోంచి వచ్చేగాలిని అబగా పీలుస్తూ, నుదుటి మీది చెమట బిందువుల తుడుచుకుని.

"అమ్మా! కలిగినోరు. దరమం సెయ్యండి, తల్లే! పిల్లా పాపా కలోరు. దరమం సెయ్యండి, తల్లే! మీకు పున్నెముంటాది దరమం సెయ్యండి, తల్లే!" అరిచారిద్దరూ కలసికట్టుగా.

ఆమె ఆశించినట్టు ఎవరూ రాలేదు.

ఉదయం ఎండ ముదురుతూ, నిప్పులు కక్కుతూంటే చొక్కాలేని బోర మీద, ముఖం మీద కారుతున్న చెమటను చిరిగిపోయిన ఆమె పువ్వుల పరికిణీని అంది పుచ్చుకుని తుడుచుకున్నాడు.

మట్టి పట్టిన వాడి శరీరం మీది ప్రక్క టెముకలు వాడి ప్రతి కదలికలోనూ కన్పిస్తూ, వరద తగ్గిన వెనుక ఏర్పడిన ఇసుకపారల్లా ఉన్నాయి. ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల వాడి వయసుతోపాటు పెరిగిన దైన్యం ఏపుగా పెరిగిన వాడి జుత్తులోనూ లోతకుపోయిన వాడి కళ్ళలోనూ కనిపిస్తూంది. వాడి చేతిలోని జర్మన్ సిల్వర్ బొచ్చెలో

మూడు అయిదు పైసల బిళ్ళలు, నాలుగు బియ్యపు గింజలు ఉన్నాయి. ఆ పిల్లవాడి కేమవుతుందోగాని వాడికన్న మూడు నాలుగు సంవత్సరాలు పెద్దది. జత్తును కూడదీసి చైతన్యైనంతగా అల్లుకుని ఒక వూలు దారంతో చివర ముడేసింది. చిరిగిన జాకెట్టు పరికిణి ఆమెకు చాలీ చాలటం లేదు. ఆమె చేతిలోనూ సిల్వరు బొచ్చె ఉంది. అందులో గుప్పెడు బియ్యపు గింజలున్నాయి. అరవటం మానేసినప్పుడ్లా ఒక్కొక్క గింజ ఎత్తి నోట్లో వేసుకుని నములుతూ అరిచే కార్యక్రమంలో మళ్ళీ నిమగ్నమవుతూంది.

"భౌ!!భౌ!" అన్న అరుపుతో మొక్కల మధ్య వృధాగా కొలాయి నుండి కారే నీటి వంక చూస్తున్న అమ్మాయి ఒక్కసారి త్రుళ్ళిపడింది.

"వోంమ్మో! కుక్కలున్నాయి. పదే పోదారి". అంటూ తొందర చేశాడు వాడు.

"ఒకటే కుక్క... అదేటి సేస్తాది. గొలును కట్టేసిండు బాబు...అమ్మా... దరమం సెయ్యండి తల్లే...బాబూ...కనికరించాల". అంటూ వాడిని వారిస్తూ అరిచిందా అమ్మాయి.

అయిదున్నర అడుగులు పొడవున్న ఆ బాబు వెనుక వూగుతూ పరుగెత్తుకొనున్న అల్సేషియన్ కుక్క ముందుకొచ్చి మరోసారి మొరిగి యజమాని వంక చూసి కళ్ళు మిటకరించింది. కారు షెడ్వైపు వెళ్లబోతూ ఆ బాబు ఆగాడు. ఆ బాబుకి పదిహేడు, పద్దెనిమిదేళ్ళు ఉంటాయి. మీసాలు కొద్దికొద్దిగా చిక్కబడ్డాయి. కండలు తిరిగిన శరీరం బనియన్లోంచి స్పష్టపడుతూంది. చిక్కితే రక్తం కారేటట్టుగా శరీరం రంగు మెరుస్తూంది. ఎడమ చేతి మణికట్టు మీదికి జారిపోతున్న రిస్టువాచీని మీదికి పదేపదే లాక్కుంటూ గేటుకి పది గజాల దూరంలో నిలబడి-

"ఎవ రక్కడ? వెళ్ళండి. వెళ్ళండి. పనిపాటులేదా?" అంటూ అరిచాడు.

"దరమం సెయ్యండి, బాబూ!. కలిగినోరు అందామ్మాయి దీనంగా ముఖం పెట్టి, గేటు క్రింది చట్రం మీద కాలుంచి ఒకచేతిని గేటు వూచలోంచి చాచి.

"కలిగినోరు! దరమం సెయ్యండి, బాబు!" వంత పాడాడు కుర్రాడు.

ఎండ ఒక వంక నుండి వాళ్ళ శరీరాల మీద పడుతూంది. చెమటతో తడిసిపోయిన వాడి ముఖాన్ని తన చిరుగుల పరికిణితో తడుస్తూ, "దరమం సెయ్యండి, బాబూ" అంటూ మళ్ళా అరిచిం దామ్మాయి.

పొమ్మనబోయిన బాబు ఆగిపోయి- "బైరీ! గేటు తాళం తియ్యి!" అంటూ ఆజ్ఞ జారీ చేశాడు. అతని వెనుకనే టర్కిష్ టవలు, బిస్కట్ల పాకెట్ పట్టుకున్న బైరీ బొడ్లోంచి తాళాలగుత్తినందుకుని గేటువైపు పరుగెత్తాడు.

బైరి గేటు తెడుస్తూంటే ఇద్దరూ నాలుగడుగులు వెనక్కి వేసి నిలబడ్డారు. "ఇద్దర్నీ లోపలకి రమ్మను". అని ఆజ్ఞాపించాడు బాబు.

"మాము రాము-కుక్కుంది." అన్నారిద్దరూ కూడపలుక్కున్నట్టు.

కుక్కను ఆ ప్రక్కనే ఉన్న బాడ్మెంటన్ పోల్కి కట్టేస్తూ, "ఇక రమ్మను".

అన్నాడు బాబు.

బైరి వాళ్ళను అప్యాయంగా చూసి, "రండి" అన్నాడు.

ధైర్యంగా ఆ అమ్మాయి లోపలికి అడుగు పెడుతూ, బైరి చేతి టవల్లోంచి వచ్చే తీయటి సబ్బు వాసన పీల్చుతూ బైరి ననుసరించింది.

కుర్రవాడూ ఆమె ననుసరించాడు.

ఇద్దరూ ఆ బాబుకి అల్లంత దూరంలో నిలబడిపోయారు. సూర్యకిరణాలు దూసుకుపోయే ఆమె బట్టల చూస్తూ, చూపులతో ఆమె శరీరాన్ని స్పృశించాడు బాబు కొద్దిగా దగ్గరికి నడుస్తూ.

"బాబూ! కలిగి నోళ్ళు-దరమం సెయ్యండి, బాబూ!" అందామ్మాయి.

"ఏ వా బిస్కట్లు?" అడిగాడు బాబు వెనక్కి తిరుగకుండా.

బైరి సంశయిస్తూ వాటి నందించి కుక్క బొచ్చు మీద ఇంకా ఆరకుండా ఉన్న నీటి బిందువులను టవల్‌తో ఒత్తడంలో నిమగ్నమైనాడు గద్దె మీద కూర్చుని.

బాబు చేతిలోని బిస్కట్లు చూస్తూ ఆశగా గుటకలు మింగారు వాళ్ళు.

"కుక్క ఏం చెయ్యదు. దగ్గరకొచ్చి నిలబడు". అని పిలిచా డా అమ్మాయిని. కొద్దిగా ప్రక్కకు వంగి కుక్క తల నిమురుతూ. కుక్క కనురెప్పలు మూస్తూ తెరుస్తూంటే ధైర్యంగా ఇద్దరూ అతనికి కొద్ది దూరంలో నిలబడ్డారు.

"ఏ వూరు మీది?" బిస్కట్ల నొక్కొక్కటి కుక్క కందిస్తూ అడిగాడు బాబు.

కుక్క తినే బిస్కట్లవైపు ఆశగా చూస్తూ, "ఏటపాలెం ఇక్కడికి శానాదూరం". అంది.

"నీ పేరు?" అడిగాడు బాబు చెమట చిందిన ఆమె గుండె మీదికి చూస్తూ.

"గౌరి...ఆడిపేరు సిత్రిగాడు...అయ్యా! రెండీయ్యవా! నాను...అడూ తింతాము..రైలు దిగొచ్చినం. నిన్నటి కాడ్నుంచి అన్నం మెతుకు సూడలే". అంటూ చెయ్యి జాచింది గౌరి.

గౌరిని చూసి వాడూ చెయ్యి చాచాడు ధైర్యంగా, రెండో చేత్తో జారిపోయే లాగును పైకి లాక్కుంటూ.

"ఇవి డబ్బులు పెట్టి కొన్నవి. వూరికే రావు". అన్నాడు బాబు-కుక్కకి ముక్కా ముక్కా కొసరి కొసరి తినిపిస్తూ.

"అయ్యా రెండు మా ముకాన్న పడేత్తె మీ సొమ్ములు కరిగిపోతయా, బాబూ!" అడిగింది గౌరి.

బైరి కళ్ళెత్తి ఆమె వైపు చూశాడు.

బాబు కళ్ళెగరేసి విలాసంగా నవ్వి "మాటలు నేర్చిన పిట్టే.. వా డెవడు?.. నీ తమ్ముడా?" అడిగాడు.

"కాదు...మా వూరోడే... మాము ఎర్రగొల్లలం.. శానమందొచ్చినం

మొచ్చినం...పచ్చ బొట్టం తారుసూడు...పచ్చ బొట్టేత్తారు మా పెద్దోల్లు'' అంటూ తన ఎడమ చేతిని, చిత్రగాడి కుడిచేతి మీది పచ్చ బొట్లను చూపించింది గౌరి.

ఆమె గడ్డం కింద అందంగా ఉన్న మూడు పచ్చటి చుక్కల్ని చూస్తున్న అతని వంక ఆశగా చూస్తూ 'రెండియ్యవా''? అంది గౌరి.

''ఇస్తాను.. ఇద్దరూ వెళ్ళి ఆ స్తంభం దగ్గర నిలబడండి. నేను బిస్కట్లు విసురుతాను. ఇద్దరూ పరుగెత్తుకొచ్చి అందుకోవాలి. ఎవరికి దొరికినవి వాళ్ళవే''. అన్నాడు.

అటు పక్కగా వెళుతున్న తోటమాలి ఆగిపోయాడు.

"రంగన్నా! ఒక చిన్న ఆట... నీవూ రా". అంటూ పిలిచాడు బాబు అతన్ని. రంగన్న తల గోక్కుంటూ అటు వచ్చాడు.

"వూ! వెళ్ళండి'' అన్నాడు ఇద్దరివైపు చూస్తూ.

''అడూ...నానూ ఒకటే బాబూ... అయ్యిచ్చీండి. మా మిద్దరము పంచుకుంతాము''. అంది గౌరి.

బైరి మెచ్చుకోలుగా గౌరివైపు చూశాడు.

"అలా కుదరదు. ఇవి కావాలంటే పోటీ తప్పదు. లేకపోతే వెళ్ళిపోండి". అంటూ గర్జించాడు బాబు.

గౌరి, చిత్రగాడు ముఖముఖాలు చూచు కున్నారు.

"సరే" అని తలూపి వాడి చెయ్యి పట్టుకుంది గౌరి. ఇద్దరూ రెండో స్తంభం దగ్గర నిలబడ్డారు, గిన్నెల్ని నేలమీద ఒక్క ప్రక్కగా ఉంచి.

బాబు ఒకసారి పొంటు మీది బనియను సర్దుకున్నాడు.

ఒకసారి బైరి వంకా రంగన్నా వంకా చూసితాను కొద్దిగా వెనక్కి పరుగెత్తి క్రికెట్ బాల్ విసిరినట్టు బిస్కట్ల పాకెట్‌ను మేడ వరండా మెట్లవైపు విసిరేస్తూ "వన్, టూ త్రీ అండ్ గో...పరుగెత్తండి'' అరిచాడు.

అతడు విసరటమే తడవుగా ఇద్దరూ మెట్లవైపు పరుగెత్తారు.

గౌరి పరుగెత్తడం బాబుకి కనునిందుగా ఉంది. కసిగా ఆమెను చూసేంతలో గౌరి వరండా మెట్టు మీది పాకెట్ మీద పడింది. ఆమె దానిని అందుకునేంతలో చిత్రగాడు ఆమె మీద పడ్డాడు. ఆమె చేతిలోంచి లాక్కోవాలని ఆమెను కింద పడేసి ఆయాస పడుతున్నాడు చిత్రగాడు. గౌరిన్ని కిందపడేసి చిత్రిగాడు ఆమె మీద దోర్లటం బాబుకి కనువిందుగా ఉంది. అతడు ఆనందంగా చప్పట్లు కొడుతూంటే బైరి ఆమె శరీరం మీద నూరెండి చూపులు తిప్పకున్నాడు.

బాబు చప్పట్లు కొట్టడం గౌరికి అవమాన మనిపించింది. ఒక్క ఉదుటున తిరగబడి చిత్రిగాడ్ని కింద పడేసి, వాడి చేతిలోని పాకెట్ లాక్కుని లేచి నిలబడింది. ఈ పెనుగులాటలో ఆమె చేతి ప్లాస్టిక్ గాజు పూర్తిగా విరిగి ముక్కయింది. కుడిచేతికి మణికట్టు భాగంలో నేల దెబ్బ తగిలింది. సన్నగా దెబ్బ నుండి కారుతున్న రక్తాన్ని

చూసుకురంటూ బాబుతోపాటు మరెవరో చప్పట్లు కొట్టటం విని ధ్వని వచ్చిన వరండావైపు చూసింది గౌరి.

నలబై అయిదేళ్ళు దాటిన స్థూలకాయుడు, అతని పక్కన మినీ స్కర్టులో పదహారేళ్ళ అమ్మాయి వరండా మీది సోఫాలో వెనక్కి వాలి కూర్చుని చప్పట్లు కొడుతూ "బ్రేవ్! బ్రేవ్! !..." అంటూ అరుస్తున్నారు.

అతను నవ్వుతూంటే రంగు వేసిన అతని ఒత్తయిన పండు మీసాలుతోపాటు అతని మెడలోని పులిగోరు పతకం ఎగిరి పడుతున్నట్టే, ఆమె ఎత్తయిన రొమ్ములు ఎగిరిపడుతున్నాయి ఆమె నవ్వుతూంటే.

మనుషుల రక్తాన్ని విస్కీ బాటిల్స్‌లోకి వంచుకుని తాగి ఎరుపెక్కిన అతని కళ్ళలోని రంగు, ఆమె బుగ్గలోని ఎర్రదనాంకేమీ తీసిపోదు. ఆమె అతని కూతురు కదా. "ఫైన్ డాడీ!" అంటూంది. ఆమె తొడల మీద నుండి స్కర్టు పెడస్టల్ ఫాను గాలికి ఎగిరి పడుతూంటే నల్ల రంగులోని తెల్ల మీసాలను సవరించుకుంటూ "ట్రైఎగైన్... బాబు ట్రై ఎగైన్' అని అరుస్తున్నాడు స్థూలకాయుడు.

"దిస్ టైమ్ ఎనెదర్ గేమ్ డాడీ! ఎనెదర్ గేమ్" అని బాబు అంటూంటే, వాళ్ళేం మాటాడుకుంటున్నారో, వాళ్ళెందుకు నవ్వుతున్నారో అర్థం కాక రెండు చేతుల్లోనూ, బిస్కట్ల పాకెట్ పట్టుకుని తెల్లగా, నున్నగా మెరిసే ఆ అమ్మాయి మీగాళ్లకేసే చూస్తూ ఉండిపోయింది గౌరి. చిత్రిగాడు మాత్రం గౌరిని ఈర్ష్యతోనే చూస్తున్నాడు.

బాబు గౌరి దగ్గరకు వచ్చాడు. హిప్ పాకెట్ లోంచి పది రూపాయల నోటు లాగి, "ఆ బిస్కట్లు, నీకే... ఈసారి గెలిస్తే చూడు.. ఈ పది రూపాయాలూ నీవే". అన్నాడు భుజం తడుతూ, పది రూపాయల నోటు గాలిలో ఆడించి.

గౌరి కొద్దిగా అతని నుండి దూరంగా జరిగి పది రూపాయల నోటు వంక ఆశగా, అతని వంక సంశయంతో చూసింది.

"అనాగే...నానూసై ...పదే, గౌరీ". అంటూ చిత్రగాడు గౌరి చెయ్యి పట్టుకులాగాడు.

"టెన్ రుపీస్...టూమచ్ బాబూ..." పంపిన గుండె మీద పండిన వెంట్రుకల్ని రాసుకుంటూ అరుస్తున్నాడు స్థూలకాయుడు. అవును. అతను అతని తండ్రి కదా!

"బాబూ! డోంట్ ఆఫర్ మనీ!" అంటూ కూర్చున్నదల్లా లేచి హైహిల్డు స్లిప్పర్సుతో వయ్యారంగా నడిచి వచ్చి బాబు చెయ్యి పట్టుకుంది, ఒక చేతితో మెడలోని పొడవైన హారాన్ని పెదిమలతో తాకుతూ.

"డోంట్ వర్రీ, బేబీ! యూ..సీ.. దిసీ ఏ..ఫైన్ గేమ్.." అంటూ ఆమెను దూరంగా తీసికెళ్ళి ఆమెకేదో చెప్పాడు బాబు.

"ఐ.సీ." అంటూ నడుం మీద రెండు చేతులుంచుకుని విరిగిపడ్డ సముద్ర కెరటంలా ఆమె నవ్వుతూంటే, ఆమె తొడల మీద చెదరిపోయే ఆమె స్కర్టును

చూసి తన పరికిణి సర్దుకుంది గౌరి.

"ఎల్దారి పద". అంది గౌరి చిత్రిగాడి చేయి పట్టుకుని.

"ఎల్దారి,..ఆగె..బాబు పది రూపాయలిత్తాడు. నానే ఈసారి గెలుత్తా". అన్నాడు చిత్రిగాడు పట్టుదలగా.

వాడి పట్టుదల చూసి ఒకసారి తల తాటించి "బేగి..వంపీ బాబు. మామెల్తాము". అంది గౌరి.

"అయితే ఇందాకటి చోట నిలబడండి". అన్నాడు బాబు.

చిత్రగాడు ముందుగా పరుగెడుతూంటే, వెంట నడిచింది గౌరి.

"బైరీ! డైనింగ్ టేబిల్ మీద బ్రెడ్ పార్సిల్ చేసి పట్రా". అంటూ బైరిని తరిమాడు బాబు.

కొడుకు చేయబోయే ఘనకార్యాన్ని చూడడానికి లేచి నిలబడ్డాడు కళ్ళున్న ధృతరాష్ట్రుడు. బేబీ వింత చూడడానికి బాబు పక్కనే నిలుచుంది. రంగన్న అన్యమనస్కంగా వాటర్ కేన్ పట్టుకుని నిలబడ్డాడు. గౌరి చిత్రిగాడికేసి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నది. కానీ వాడు వినటం లేదు. బైరి తిరిగొచ్చాడు, చేతిలో పార్సిల్‌తో.

బాబు ఉత్సాహంగా ఈలవేస్తూ "డాడీ! బేబీ! ! రెడీ...లుక్ దిస్ గేమ్, దిస్ టైమ్". అంటూ గౌరి, చిత్రిగాడి వంక తిరిగి-

"ఈ పార్సిల్ ఎవరు తెస్తే వాళ్ళకే పది రూపాయలు...వెళ్ళి అక్కడ నిలబడండి. పరుగెత్తమనగానే పరుగెత్తండి". అంటూ సూచన లిచ్చి "రెడీ!" అన్నాడు బాబు.

గౌరి భయం భయంగా తల తిప్పితే చిత్రిగాడు ధైర్యంగా తలాడించాడు.

"వన్ టూ త్రీ...అండ్ గో". అని అరుస్తూ వరండా వైపు పార్సిల్ విసిరి తను బాడ్‌మెంటన్ పోల్ వైపు పరుగెత్తాడు బాబు.

గౌరి, చిత్రిగాడు ఒకర్ని మించి ఒకరు పోటీ వడి దాటిపోవాలని పరుగెడుతూంటే, బేబి ఎంపైర్‌లానడుం మీద రెండు చేతులుంచుకుని, నవ్వుతూ నిలబడుతూంటే, మెరుపులా ఆల్సేషియన్ పులిలా ముందుకు దూకుతూ వరండా మెట్ల వైపు పరుగెడుతూంటే, బైరి నిరుత్తరుడై నిలబడి పోతూంటే "కమాన్.. నాన్సీ!...రన్...కిల్ దీజ్ బెగ్గర్స్". అని బాబు అరుస్తూ ఈల వేస్తున్నాడు. నాన్సీ కోరలు చాపి పరిగెడుతూంది. బేబి, బాబుతో గొంతు కలిపి అరుస్తూ చప్పట్లు కొడుతూంది.

గౌరి చిత్రిగాడ్ని దాటి, తన్ను దాటి పోవాలని చూస్తున్న నాన్సీని చూసి ప్రమాదాన్ని గమనించి వెనక్కి అడుగెయ్యబోయి, ముందుకు పోబోయే చిత్రిగాడ్ని వెనక్కి నెట్టి, పార్సిలోకి దగ్గరగా వచ్చే నాన్సీకన్నా ఒక్క అడుగు ముందు వేసి పార్సిలు నందుకుంది. అవమానంతో చిత్రిగాడు గౌరిని నేల మీదికి నెట్టేస్తూంటే, అంతకన్నా అవమానంతో, ఆకలిగొన్న పులిలా గౌరీ మీదకు దూకి ఆమె కాలును పట్టుకోబోతున్న నాన్సీని బైరి మెరుపులా పరుగెత్తుకొచ్చి చైన్ పట్టుకుని బలంగా

లాగి అపాడు. గౌరీ కాలు పట్టు దొరకని నాన్సీ అందినంత మేర గౌరీ పరికినీని చింపి, ఆవేశంతో నాలుక బారెడు చాచి యజమాని ఆదేశం కోసం రొప్పుతూ నిలబడింది.

గౌరి కాళ్ళ మీద చిరిగిన పరికిణిలో శరీరాన్ని దాచుకోజూస్తూ, కాలి మీద ఏర్పడ్డ నాన్సీ గోళ్ళ బక్కర్లలోంచి బొటబొట కారే రక్తపు బొట్లను చూసి బాధగా కళ్ళలో తిరిగే కన్నీటినాపుకుంటూ రెండు చేతులతో కాలిని పట్టుకుని కూలబడి పోయింది.

"రాస్కెల్! నాన్సీ నెందుకు అపావ్?" చెప్పు అంటూ బైరి చెంప మీదకొట్టాడు.

రంగన్న చేతిలో వాటర్ కేన్ కింద పడింది.

రంగన్న బైరివైపు పరుగెత్తు కొచ్చి "నాన్సీ ఆళ్ళని సంపేస్తాది, బాబూ!" అన్నాడు సంజాయిషి చెప్పే దోరణిలో.

గౌరి లేచి నిలబడింది వణికే ఆమె రెండు చేతులతో బిస్కట్ల పాకెట్, బ్రెడ్ పార్సిల్‌ను అందుకుంది. చిత్రిగాడ్ని దగ్గరగా తెచ్చుకుని బాబుకు కొద్ది దూరంలో నిలబడి "బాబూ... ఇయ్యిగో...మీ రొట్టె ముక్కలు...మీ కుక్కలకేసి బాగా మేపండి బాబూ...ఇయ్యి మాకొద్దు...మమ్మల్నీనాగ బతకనీయండి, బాబూ! మీకు దండాలు!" అంటూ చేతిలో వాటిని అతని ముందు గిరవాటేసి, రెండు చేతులు జోడించి వెనక్కు తిరిగింది.

"ఏయ్! పిల్లా! ఆగు". అంటూ ధృతరాష్ట్రుడు ఆజ్ఞాపించినట్టు పిలిచాడు. గౌరి ఆగి వెను దిరిగింది. చిత్రిగాడూ ఆగిపోయాడు.

"ఈ రెండు రూపాయలూ తీసికో". అంటూ రెండు రుపాయల నోటు మడిచి ఆమెవైపు గిరవాటేశాడు.

"మీ డబ్బులు మీకాడే ఉంచుకోండి,బాబు! మాకొద్దు! ఆ డబ్బుతో మీ కుక్కలికి తిండి పెట్టండి, బాబు!" అంటూ చిత్రిగాడ్ని దగ్గరకు తీసికుంది గౌరి.

గిన్నెల్ని పట్టుకుని, చిత్రిగాడితో వెళ్ళిపోయే గౌరికి-

"నా జీతం నా కిప్పించండి, పెదబాబు! నే వెళ్ళిపోతాను!" అనే బైరి మాటలు గౌరికి వినిపించాయో, లేదో గానీ ఆ మాటలు వింటున్న రంగన్న తన తల మీద పాగాను విప్పి నడుముకు బిగిస్తూ, పెదబాబువైపు దూకుడుగా వెళ్ళటం మాత్రం చిత్రిగాడు చూశాడు.

★ ★ ★